1 రోజులో..


ఎల్కతుర్తి రజతోత్సవ సభా ప్రాంగణం డ్రోన్ ఫొటో


హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభా వేదిక లైటింగ్ పనులు పూర్తయ్యి పండుగ వాతావరణం సంతరించుకోవడంతో చూసేందుకు వచ్చిన ఎల్కతుర్తి ప్రజలు. రాత్రివేళ ధగధగ వెలిగిపోతున్న 'గులాబీ మైదానం' వద్ద అక్కడికి వచ్చిన స్థానిక మహిళలు.. పిల్లలతో కాసేపు సరదాగా గడపడం కనిపించింది.

## 1,213 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ

ఎల్కతుర్తిలోని 1,213 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం సిద్ధమైంది. 500 మంది కూర్చునే సామర్థ్యంతో వేదిక గులాబీ రంగులతో అద్భుతంగా తీర్చిదిద్దారు. వేదిక పక్కనే కళాకారుల ఆట-పాట కోసం ప్రత్యేకంగా మరో వేదికను ఏర్పాటుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే దాదాపు 50 వేల వాహనాల కోసం 1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. మహాసభ ప్రాంగణంలో వాహనాలు, ప్రజలు వచ్చేందుకు వీలుగా గ్రీన్, రెడ్ కార్పెట్లు ఏర్పాటుచేశారు. మహాసభకు ముందుగా వచ్చిన వారు కూర్చునేలా లక్షకుపైగా కుర్చీలను ఏర్పాటు వేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారికేడ్లు పెట్టారు. పగటిపూటను తలపించేలా వెలుగులు విరజిమ్మేలా లైట్లను అమర్చారు. లైట్లు, ఎల్ఈడీల కోసం 200 భారీ జనరేటర్లను ఏర్పాటుచేశారు. కేసీఆర్ అందరికీ స్పష్టంగా కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, భారీ సౌండ్ సిస్టంను చుట్టుపక్కల ఏర్పాటుచేశారు.

# గులాబీ పండుగకు సర్వం సిద్ధం

**రేపు బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ • ఎల్కతుర్తి పరిసరాలు గులాబీమయం**
**6 అంబులెన్సులు, 12 వైద్య శిబిరాలు • ఆవరణంలో 23 భారీ ఎల్ ఈడీ స్క్రీన్లు**
**1,200 టెంపరరీ మరుగుదొడ్ల ఏర్పాటు • భారీఫ్లెక్సీలు, కటౌట్లు, గులాబీ తోరణాలు**

వరంగల్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ పండుగకు సర్వం సిద్ధమైంది. ఎల్కతుర్తి పరిసరాలు గులాబీమయం అయాయి. లక్షలాదిగా తరలివచ్చే జనానికి తాత్కాలిక వసతి సౌకర్యాలు సిద్ధమయ్యాయి. మొత్తంగా గులాబీ పార్టీ 25 ఏండ్ల పండుగ అద్భుతంగా జరిగేలా ఏర్పాట్లు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన గులాబీ పార్టీ 25 ఏండ్ల పండుగకు లక్షలాది మంది తరలిరానున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే ఈ సభ చరిత్రలో నిలిచిపోతుంది. 14 ఏండ్ల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, 2014 నుంచి పదేండ్లపాటు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన బీఆర్ఎస్ సుపరిపాలన మేళవింపుగా ఈ రజతోత్సవ మహాసభ ఆసాంతం ఉండనున్నది. బీఆర్ఎస్‌కు చెందిన జెండాలు, ఫ్లెక్సీలు, భారీ కటౌట్లతో ఎల్కతుర్తి పూర్తిగా గులాబీశోభను సంతరించుకుంది. మహాసభ ప్రాంగణానికి వచ్చే అన్ని దారుల్లో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో ఉన్న జెండాలతో ఆ ప్రాంతం మొత్తం గులాబీ మయమైంది. ఎల్కతుర్తి ప్రధాన జంక్షన్‌లో పెట్టిన కేసీఆర్ భారీ కటౌట్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. వేదిక ముందు 25 వసంతాల బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్ కటౌట్లు విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అభిమానులు, కార్యకర్తలు అక్కడ ఉత్సాహంగా ఫొటోలు దిగుతున్నారు.

### బీఆర్ఎస్ నేతల నిర్విరామ కృషి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, సూచనలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షణలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు జరిగాయి. నేతల నిర్విరామ కృషితో సర్వం సిద్ధమైంది.

### ఎల్కతుర్తి రోడ్లకు కొత్తరూపు

బీఆర్ఎస్ మహాసభతో ఎల్కతుర్తి పూర్తిగా కొత్త రూపును సంతరించుకున్నది. బండ్లబాటలు పెద్ద రోడ్లుగా మారాయి. పెద్ద రోడ్లు మరింత బాగా తయారయ్యాయి. ఎల్కతుర్తిలోని దాదాపు 10 కిలోమీటర్ల దూరం వరకు అన్ని రోడ్డు మార్గాల్లో చెత్తను, ముండ్ల చెట్లను తొలగించారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేశారు. రైతుల పొలాల్లో ఎక్కడా ఒక్క పిచ్చి మొక్క కనిపించకుండా, ముండ్లకంప లేకుండా చదనయ్యాయి. బీఆర్ఎస్ మహాసభ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారు. ఎల్కతుర్తి పరిసర ప్రాంతాల్లోని ప్రజల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. బీఆర్ఎస్ మహాసభతో ఎల్కతుర్తికి కొత్త గుర్తింపు వచ్చిందని అంటున్నారు.

### వసతి, సదుపాయాల ఏర్పాట్లు

- 10 లక్షల వాటర్ బాటిళ్లు
- 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- వివిధ రూట్లలో 6 అంబులెన్స్‌లు
- పరిసరాల్లో 12 వైద్యశిబిరాలు
- 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు
- పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వలంటీర్లు


సిద్దిపేటలోని రంగధాంపల్లిలో యువత పాదయాత్రను ప్రారంభించి వారితో కలిసి నడుస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# లక్ష్యాన్ని ముద్దాడిన పార్టీ బీఆర్ఎస్

- **కోట్ల మందిని ఏకం చేసింది కేసీఆరే**
- **బీఆర్ఎస్ ఎప్పటికీ తెలంగాణ పక్షమే**
- **బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్**
- **రజతోత్సవ సభకు యువత పాదయాత్ర ప్రారంభం.. వారితో కలిసి 6 కి.మీ నడిచిన హరీశ్**

సిద్దిపేట, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి. కానీ, బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్ చరిత్రలో నిలిచింది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి, సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉన్నదని, ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైన సందర్భమైనా సిద్దిపేటకు పేగు బంధం ఉన్నదని గుర్తుచేశారు. శుక్రవారం సిద్దిపేటలోని రంగధాంపల్లిలో అమరవీరుల స్తూపానికి పూలువేసి నివాళులర్పించారు. అనంతరం వరంగల్ సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి 1500 మంది యువత పాదయాత్ర చేపట్టగా హరీశ్ జెండా ఊపి ప్రారంభించారు. వారితో కలిసి దాదాపు 6 కిలోమీటర్లకు పైగా పాదయాత్రలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వారితో కలిసి భోజనం చేసి కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మీరు చేస్తున్న ఈ పాదయాత్ర రేపటి బీఆర్ఎస్ విజయ యాత్ర కాబోతున్నది' అని పేర్కొన్నారు. పాదయాత్రగా బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందు ఉగ్రదాడి మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధించు, సమీకరించు, పోరాడు అని చెప్పారని, అదే పద్ధతిలో కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్, ప్రజలందరికీ తెలంగాణ ఎందుకు అవసరమో బోధించారని గుర్తుచేశారు. సమైక్యవాదులపై, ఢిల్లీ పెద్దలపై పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. 1969లో పోలీసుల కాల్పుల్లో 369 మంది చనిపోయారని, ఆనాటి హింసను దృష్టిలో పెట్టుకొని మలిదశ ఉద్యమంలో గాంధీ చూపిన బాటలో తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ముందుకు నడిపారని చెప్పారు. 14 ఏండ్ల ఉద్యమం, 10 ఏండ్ల పాలన.. ఏడాదిన్నరగా ప్రతిపక్షం. ఇలా ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ధాన్యం ఉత్పత్తి, తలసరి ఆదాయం, జీఎస్డీపీలో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందని కొనియాడారు. డాక్టర్ల ఉత్పత్తిలోనూ తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు.

### కాంగ్రెస్‌కు చెంపపెట్టు కావాలె

'ఈ రోజు యువత చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలె..ఆ రోజు లంకలో రావణుడు చేసే అరాచకాలను ఎదిరించేందుకు రామదండు కదిలింది. ఈరోజు కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించేందుకు ఈ గులాబీ దండు కదిలింది' అని హరీశ్ చెప్పారు. పాదయాత్రలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను వివరించాలని సూచించారు. మూడు రోజులపాటు 70 కిలోమీటర్లు పాదయాత్ర చేసి గులాబీ దండు రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు కదిలిందని చెప్పారు. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభ కోసం స్వచ్ఛందంగా తరలివచ్చినందుకు అభినందించారు.

## ఇంటింటికీ వెళ్లి.. బొట్టు పెట్టి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : ఎల్కతుర్తి సభకు రావాలని మహబూబాబాద్‌లోని 35వ వార్డులో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ శుక్రవారం మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ సందేశం వినాలని ప్రజలు సభకు స్వచ్ఛందంగా వస్తున్నట్టు తెలిపారు.





## కేసీఆర్‌ది సంక్షేమం.. రేవంత్‌ది విధ్వంసం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల**

కంఠేశ్వర్, ఏప్రిల్ 25: పదేండ్ల కేసీఆర్ పాలన సంక్షేమమైతే.. 17 నెలల రేవంత్‌రెడ్డి పాలన విధ్వంసమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి వేముల మాట్లాడారు. టీఆర్ఎస్ పుట్టింది తెలంగాణ ప్రజల కోసమని చెప్పారు. 15 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత రాష్ట్రాన్ని సాధించి ప్రజలకు విముక్తి కలిగించిందని తెలిపారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టారని గుర్తుచేశారు. రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి 2,400 వాహనాల్లో 40 వేల మంది తరలివెళ్లనున్నట్టు చెప్పారు.



## బీఆర్ఎస్ దండు కదలాలి

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 : గులాబీ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు దండులా కదలాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొనగా.. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు పాలమూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు.


తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, తుంగ బాలు

# మేడారం జాతరలా బీఆర్ఎస్ సభ

- **రజతోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తి**
- **అంతా సాఫీగా చేరేలా ప్లాన్**
- **ఏర్పాట్లను పర్యవేక్షించిన కేసీఆర్**
- **కాంగ్రెస్‌పై కసిగా ఉన్న ప్రజానీకం**
- **అది కాంగ్రెస్, బీజేపీల నివేదిక**
- **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణ**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మేడారం జాతరను తలపించేలా ఎల్కతుర్తి సభ ఉంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో పురుడు పోసుకున్న టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ 25 ఏండ్లు పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా ఎల్కతుర్తి సభకు సజావుగా చేరుకునేలా ఏర్పాట్లు జరిగాయని వివరించారు. సభా ఏర్పాట్లను రోజూ కేసీఆర్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సభకు వచ్చే వాహనాల కోసం 1,200 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్‌పై కసిగా ఉన్నారని, బీఆర్ఎస్ సభకు తరలివచ్చేందుకు తమ సొంత పనిగా భావిస్తున్నారని తెలిపారు. గ్రామాల నుంచి 80 ఏండ్ల వృద్ధులు కూడా ఈ సభకు వచ్చేందుకు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల సభ జరుపుకుంటుంటే.. ప్రజలు మాత్రం దీనిని కాంగ్రెస్ వ్యతిరేక సభగా భావించుకుంటున్నారని జగదీశ్‌రెడ్డి చెప్పారు. దేశ చరిత్రలోనే అతి పెద్ద భారీ సభలు నిర్వహించిన చరిత్ర ఉన్నదని, అలాంటి సభల రికార్డులు తిరిగే రాసేది కూడా బీఆర్ఎస్ అవుతుందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి జనం తరలి వచ్చేందుకు సిద్ధమయ్యారని, కాంగ్రెస్, బీజేపీలు మాత్రం ఓర్వలేక పోతున్నాయని దుయ్యబట్టారు.

### అది ఎన్డీఏ రిపోర్టు

మేడిగడ్డ, కాళేశ్వరం, సుందిళ్లపై ప్రాజెక్టులపై ఇచ్చింది ఎన్డీఎస్ఏ నివేదిక కాదని, అది ఎన్డీఏ రిపోర్టు అని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఇచ్చిన నివేదిక అంటూ ఆయన ఎద్దేవా చేశారు. గతంలో కూడా ఎన్నికలప్పుడు హడావుడి చేశారని, రజతోత్సవ సభ నేపథ్యంలో మళ్లీ ఇప్పుడు అదే హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కే అది పనికిమాలిన రిపోర్టు అని, అది చెత్తబుట్టలో వేయడానికే పనికొస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కే కిషోర్‌గౌడ్, బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్ఎస్ నేతలు నరసింహారెడ్డి, ధర్మేందర్, సంజీవరావు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట పౌరుషాన్ని నిలబెట్టుకోవాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 : ఎల్కతుర్తిలో 27న నిర్వహించే రజతోత్సవ సభలో వర్ధన్నపేట నియోజకవర్గ పౌరుషాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని వర్ధన్నపేట ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో శుక్రవారం ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించగా.. ఎర్రబెల్లి ఎడ్లబండి నడుపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఉదయమే పార్టీ జెండా ఎగరవేసి సభాస్థలికి చేరుకోవాలని సూచించారు. సభలో ఎడ్లబండ్లు హైలెట్ కావాలని తెలిపారు.





శేరిలింగంపల్లికి చెందిన రవీందర్‌యాదవ్ ఒడిశాలోని పూరీ బీచ్‌లో కేసీఆర్ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పం వీడియోను శుక్రవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించి రవీందర్‌ను అభినందించారు. - హైదరాబాద్



## చరిత్రలో నిలిచేలా రజతోత్సవం

**ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25: దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నామని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. చలో వరంగల్ ఏర్పాట్లపై ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ రాక్షస పాలనపై వరంగల్ సభ యుద్ధభేరి మోగిస్తుందని చెప్పారు. అనంతరం ఆర్మూర్‌లో రేవంత్ గోబ్యాక్ – కేసీఆర్ కమ్ బ్యాక్ అని వాల్ పెయింటింగ్ రాశారు.